


రక్షాబంధన్..
» అన్నాచెల్లెళ్ల ప్రేమకు ప్రతిరూపం
» నేడు రాఖీ పండగ
» హోటేకేటల్లా గ్రీటింగులు, రాఖీలు, గిఫ్ట్ ఆర్టికల్స్ అమ్మకాలు -5లో





సాయం సంధ్య వేళ డ్రోన్ కెమెరాతో మత్స్యగెడ్డ ప్రాంతాన్ని బంధించిన చిత్రం

భళారే విచిత్రం

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ డే

వంద మాటలు చెప్పలేని భావం ఒక్క ఫొటో చెబుతుంది. అందమైన అర్థమైన చిత్రాలు చూసినప్పుడు కలిగే భావం మాటల్లో వర్ణించలేనిది. అలా సుందర దృశ్యాలను చిత్రాలుగా మార్చే గొప్పదనం ఫొటోగ్రఫీది. మన మధుర జ్ఞాపకాలను కలకాలం పదిలంగా ఉంచే శక్తి ఒక్క ఫొటోకి మాత్రమే ఉందనడంలో అతిశయోక్తి లేదు. అద్భుత, సుందరమైన ఫొటోలను ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా కెమెరాలో బంధించిన పలు చిత్రాలు.

- ముంచంగిపుట్టు



జోలాపుట్టు జలాశయం (డ్రోన్ షాట్)

నేటి నుంచి క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు



కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరురూరల్, ఆగస్టు 18: ఈనెల 19వ తేదీ నుంచి ఐదు రోజులపాటు పాడేరు డివిజన్ పరిధిలో 35 సంవత్సరాలు దాటిన వారికి క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్‌లకు సంబంధించి స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 35 ఏళ్లు దాటిన సాధారణ ప్రజలు ఈ పరీక్షలను చేయించుకోవచ్చని స్పష్టం చేశారు. ఈనెల 19వ తేదీన అరకు ఏరియా ఆస్పత్రిలో, 20, 21వ తేదీలలో పాడేరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో, 22వ తేదీన చింతపల్లి మండలం కోరుకొండ పీహెచ్‌సీలోను, 23వ తేదీన చింతపల్లి ఏరియా ఆస్పత్రిల్లో క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పాడేరు డివిజన్ పరిధిలోని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి



నరసింగరావు (ఫైల్ ఫొటో)

పెదబయలు, ఆగస్టు 18: పిడుగుపాటుకు గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో మారుమూల జామిగూడ పంచాయతీలో చోటుచేసుకుంది. జడిగూడ గ్రామానికి చెందిన కిల్లో నరసింగరావు(21) ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై పోడు భూమిలో పనిచేసేందుకు వెళుతుండగా వర్షం ప్రారంభమైంది. దీంతో వాహనాన్ని నిలుపుదల చేసి రోడ్డు పక్కన గల ఓ చెట్టు కింద నిలబడ్డాడు. అదే సమయంలో పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో నరసింగరావు ఒక్కసారిగా కుప్పకూలాడు. కొద్ది సేపటి తరువాత సమీపంలో దుక్కి దున్నుతున్న గ్రామస్థులు కొందరు అతడిని పరిశీలించగా.. అప్పటికే మృతి చెందాడు. వెంటనే స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి వచ్చిన కుటుంబ సభ్యులు భోరున విలపించారు. పోలీస్, రెవెన్యూ సిబ్బంది మృతదేహానికి పంచనామా చేసి, ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. నరసింగరావు ఇంటర్ పూర్తి చేశాడు.

బదిలీల జాతర

ఉద్యోగుల స్థానచలనానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- నేటి నుంచి దరఖాస్తులకు అవకాశం
- నెలాఖరు వరకు గడువు
- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ప్రక్రియ
- సిఫారసు లేఖల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు



విశాఖపట్నం/పాడేరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారిని తప్పనిసరిగా బదిలీ చేస్తారు. బదిలీ కోరుకున్న సమయంలో జీరో సర్వీసును కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. నెలాఖరు వరకు సంబంధిత విభాగాధిపతికి అందజేసేందుకు గడువుంది.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో మూడు జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీ కోరుకునే వెసులుబాటు కల్పించినట్టయింది. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం జిల్లాల విభజన సమయంలో నగరం నుంచి అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు వెళ్లిన అధికారులు, ఉద్యోగుల్లో అధికశాతం మంది మైదానం/ నగరానికి రావడానికి ఉత్సాహం చూపిస్తున్నారు.

సిఫారసులకు క్యూలు

బదిలీల కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన వెంటనే అధికారులు, ఉద్యోగులు కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కీలక ప్రాంతాల్లో పోస్టింగ్ కోసం సిఫారసు లేఖలు పొందేందుకు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇందులో భాగంగా కొందరు అధికారులు/ఉద్యోగులు విశాఖలోని ప్రజాప్రతినిధుల నుంచి ఇప్పటికే లేఖలు తీసుకున్నట్టు సమాచారం.

జీవీఎంసీ పరిధి యూనిట్‌గా..

ఒకే చోట ఐదేళ్లు, అంతకంటే ఎక్కువ సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగికి బదిలీ తప్పనిసరి. అయితే జీవీఎంసీ పరిధిని మొత్తం ఒక యూనిట్‌గా పరిగణిస్తారని ఉద్యోగులు చెబుతున్నారు. ఉదాహరణకు రెవెన్యూ ఉద్యోగులు కలెక్టరేట్‌తోపాటు విశాఖ పరిధిలోని పలు తహసీల్దార్ల కార్యాలయాల్లో పనిచేసిన కాలాన్ని మొత్తంగా లెక్కిస్తారంటున్నారు. దీని వల్ల నగరంలో రెవెన్యూతో పాటు పలు శాఖల ఉద్యోగులు అనకాపల్లి, పాడేరు ఏజెన్సీకి బదిలీకి అర్హులంటున్నారు. ఏళ్లుగా నగరంలో తిష్ఠవేసిన ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందేనని ఓ సీనియర్ ఉద్యోగి తెలిపారు. బదిలీల్లో ముందుగా పాడేరు ఐటీడీఏ పరిధిలో ఖాళీలు భర్తీ చేయాలని తాజాగా విడుదలచేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం ఆదేశించింది. అటు తరువాతే మైదానం/నగరంలో ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఏజెన్సీలో పనిచేసిన

... మిగతా 6వ పేజీలో

తహసీల్దార్లకు వర్తిస్తాయా?

విశాఖ జిల్లాలో గత నెలలోనే తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు డివిజన్ పరిధిలో తహసీల్దార్ల బదిలీలకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారడంతో మూడు వారాలుగా పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్నారు. అయితే శనివారం కోడ్ ఎత్తివేయడంతో ఈ జిల్లాల్లో తహసీల్దార్ల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. కాగా ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా బదిలీలు చేపట్టాలన్న తాజా ఉత్తర్వుల మేరకు తహసీల్దార్లకు పోస్టింగ్స్ ఇవ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది.

ఏజెన్సీలో రెండేళ్లకు పైగా సర్వీసు పూర్తిచేసిన వారు, 50 ఏళ్ల వయసు దాటిన అధికారులను మైదానానికి తీసుకురావాలి. దీనిని పరిగణనలో తీసుకుంటే ఏజెన్సీలో ఈ ఏడాది జనవరి 30 వరకు పనిచేసిన వారంతా మైదానికి రావడానికి అర్హులు. అంతేకాకుండా జిల్లాల విభజన సమయంలో ఇచ్చిన పోస్టింగ్స్‌లో ఉద్యోగులు/అధికారులను మూడు కేటగిరీలుగా విభజించారు. సర్వీసులో అత్యంత సీనియర్లను విశాఖలోనూ, సీనియర్లను అనకాపల్లి, జూనియర్లను అల్లూరి జిల్లాలకు పంపారు. అయితే 2022 ఏప్రిల్ తరువాత జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతులు వచ్చినపుడు విశాఖ జిల్లాలోనే పోస్టింగ్స్ ఇచ్చారు. వాస్తవంగా వీరిని పాడేరు డివిజన్‌కు పంపాలి. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు చేపడుతున్న నేపథ్యంలో అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో తహసీల్దార్ల పోస్టింగ్స్ కూడా విశాఖ కలెక్టరే చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే ప్రక్రియ పూర్తిచేసిన విశాఖ జిల్లాను కూడా ఈ బదిలీల్లో పరిగణనలోనికి తీసుకుంటారా?, లేక మినహాయింపు ఇస్తారా? అనేది తేలాల్సి ఉంది. కాగా అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో పనిచేస్తున్న 13 మంది తహసీల్దార్లు విశాఖలో పోస్టింగ్స్ కోసం ఇప్పటికే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

పర్యాటకుల సందడి

- కిటకిటలాడిన అరకులోయ, లంబసింగి



అరకులోయలో స్కై సైక్లింగ్‌లో పాల్గొన్న పర్యాటకుడు

అరకులోయ/చింతపల్లి, ఆగస్టు 18: మన్యంలో ప్రకృతి అందాలను తిలకించేందుకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. అన్ని పర్యాటక కేంద్రాలు కిటకిటలాడాయి. అందాల అరకులోయలో మూడు రోజులుగా పర్యాటకుల సందడి కొనసాగుతోంది. పంద్రాగస్టు నుంచి వరుస సెలవులు రావడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. ఘాట్‌రోడ్‌లో కాఫీతోటలు, గాలికొండ వ్యూపాయింట్, ట్రైబల్ మ్యూజియం, పద్మాపురం గార్డెన్, రణజిల్లెడ జలపాతాలను సందర్శకులు తిలకించారు. అదేవిధంగా మ్యూజియం ఆవరణలో ఉన్న బోటుషికారు, జిప్‌లైన్, స్కైసైక్లింగ్ , ఇతర సాగహక్రీడల్లో హుషారుగా పాల్గొన్నారు.



చెరువులవేనం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

లంబసింగికి తాకిడి

ఆంధ్రకశ్మీర్ లంబసింగికి పర్యాటకుల తాకిడి పెరిగింది. లంబసింగి, చెరువులవేనం ప్రాంతాల్లో మంచు, ప్రకృతి అందాలను వీక్షించేందుకు పర్యాటకులు వస్తున్నారు. ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో లంబసింగి వచ్చారు. కొంతమంది ముందు రోజు వచ్చి స్థానికంగా బస చేశారు. దీంతో ఉదయం ఐదు గంటల నుంచే లంబసింగి, చెరువులవేనం, తాజంగి జలాశయం వద్ద పర్యాటకుల సందడి ప్రారంభమైంది. చెరువులవేనం వ్యూపాయింట్ పర్యాటకులు మంచు అందాలు ఆస్వాదిస్తూ ఎంజాయి చేశారు. సాయంత్రం వరకు లంబసింగి పరిసర ప్రాంతాలు పర్యాటకులతో రద్దీగా కనిపించాయి.

మోదకొండమ్మ ఆలయం కిటకిట -6లో

సంప్రదాయ వరి విత్తనాలకు పునరుజ్జీవం

ఆర్‌ఏఆర్‌ఎస్‌లో 21 రకాల వంగడాలపై పరిశోధనలు

- భవిష్యత్తు తరాలకు మేలుజాతి వంగడాలు అందించడమే లక్ష్యం
- పోషక విలువలు, ఔషధగుణాలపై నివేదికలు
- ఐదేళ్ల పాటు పరిశోధనలకు ప్రణాళిక



సంప్రదాయ వరి రకాల నారు

చింతపల్లి, ఆగస్టు 18: తూర్పు కనుమల్లో అంతరించిపోతున్న ఆదివాసీల సంప్రదాయ వరి విత్తనాలకు పునరుజ్జీవం కల్పించేందుకు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ముందడుగు వేస్తున్నారు. రైతుల నుంచి సేకరించిన 21 రకాల వంగడాలపై అధ్యయనం చేసేందుకు ఈ ఏడాది ప్రయోగాత్మక సాగు చేపడుతున్నారు. దిగుబడి, నాణ్యత, పోషక విలువలు, రుచి ఆధారంగా మేలిజాతి వంగడాలను తయారు చేసేందుకు పరిశోధనలు చేయనున్నారు. భవిష్యత్తు తరాలకు వీటిని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు.



విభిన్న వర్ణంలోనున్న కాలాభట్ నారు

తూర్పు కనుమల్లో పూర్వం ఆదివాసీలు పలు రకాల సంప్రదాయ వరి విత్తనాలను సాగు చేసేవారు. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క రకం పేరుతో ఈ వంగడాలను పిలిచేవారు. కొన్ని రకాల వరి విత్తనాలు బాస్మతిని తలపించే సువాసనలు వెదజల్లుతుంటాయి. మరికొన్ని రకాలు మధుమేహం వ్యాధి కలిగిన బాధితులు ఆహారంగా తీసుకున్న చక్కెర స్థాయిని స్థిరంగా ఉంచుతాయి. ఈ రకాలు ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో లేవు. అతి తక్కువ మంది ఆదివాసీ రైతులు ఆహారం కోసం ఈ పంటలను సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుత రోజుల్లో మధుమేహం, రక్తపోటు బాధితులు ఆహారం కోసం సూపర్‌మార్కెట్లలో లభించే రెడ్, బ్రౌన్, బ్లాక్ రైస్ అధిక ధర చెల్లించి కొనుగోలు చేసుకుని ఆహారంగా తీసుకుంటున్నారు. అయితే మార్కెట్‌లో లభిస్తున్న రైస్ కంటే ఆదివాసీలు పూర్వం సాగు చేసే వరి వంగడాల్లో ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషకాలు, ఔషధ గుణాలు ఉన్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ నేపథ్యంలో అంతరించిపోతున్న సంప్రదాయ వరి విత్తనాలను అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించారు.

గిరిజన రైతుల నుంచి సేకరణ

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లాల గిరిజన రైతుల నుంచి శాస్త్రవేత్తలు సంప్రదాయ వరి

... మిగతా 6వ పేజీలో

పెందుర్తి-అరకు రోడ్డుకు మహర్దశ

రూ.935.76 కోట్లతో బౌడారా రోడ్డు విస్తరణకు మోక్షం



పెందుర్తి- అరకు- బౌడారా రోడ్డు

పెందుర్తి, ఆగస్టు 18: జిల్లాలోని పెందుర్తి జంక్షన్ నుంచి విజయనగరం జిల్లా కొత్తవలస మీదుగా ఉన్న బౌడారా రహదారి ఎన్‌హెచ్ 516 విస్తరణకు మోక్షం లభించనుంది. భారతమాల పరియోజన పథకం కింద సుమారు 45 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ రహదారికి 516బి నంబరు కేటాయించి, నాలుగు వరసలుగా అభివృద్ధి చేయనున్నారు.

పెందుర్తి నుంచి కొత్తవలస, శృంగవరపుకోట మీదుగా అరకు వెళ్లే బౌడారా రోడ్డు 516ఈ జాతీయ రహదారిని కలిపే విధంగా అభివృద్ధి చేస్తారు. ఇందుకోసం భూసేకరణ, పునరావాసం, నిర్మాణానికి రూ.935.76 కోట్లు ఖర్చవుతుందని జాతీయ రహదారి సంస్థ అంచనా వేసింది. 2023లోనే ఈ రోడ్డు పనులకు ఆమోదం లభించినా ఇప్పటివరకు కేవలం రూ.11.81 కోట్లు మాత్రమే ఖర్చుచేశారు. ప్రస్తుతం ఈ రహదారిలో రూ.782 కోట్లతో చేపట్టనున్న పనులకు టెండర్లను ఆహ్వానించారు. ఈనెల 28న కాంట్రాక్టర్‌ను ఖరారు చేసి రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నారు. మొదటి విడతగా ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.181.22 కోట్లు కేటాయించింది.



సరిపల్లిలో రహదారి విస్తరణకు మార్కింగ్ చేసిన సర్వే రాయి

ఆదిలోనే సర్వేకు అడ్డగింత

రహదారి విస్తరణకు సంబంధించి గత ఏడాది డీపీఆర్ మ్యాపింగ్ సర్వే చేపట్టారు. మండలంలోని సరిపల్లిలో జాతీయ రహదారుల సంస్థ, రెవెన్యూ సర్వే సిబ్బంది మార్కింగ్ రాళ్లను వేశారు. తమ భూములు, ఆస్తులపై సర్వే చేస్తున్నారనే సమాచారంతో బాధితులు అడ్డుకున్నారు. ప్రాథమిక సర్వే అని సిబ్బంది తెలిపినా వినిపించుకోలేదు. దీంతో పాటు రోడ్డు మధ్య నుంచి కుడివైపున 90 అడుగులు, ఎడమవైపు 40 అడుగులు విస్తరణ చేపట్టడం దారుణమన్నారు. దీనిపై కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రస్తుతం నిధుల కేటాయింపు జరగడంతో పనుల్లో కదలిక వస్తుందని భావిస్తున్నారు. నిర్మాణ పనులపై అభ్యంతరాలు స్వీకరించి, అనంతరం గెజిట్ నోటిఫికేషన్ ఇస్తారని సమాచారం.

అందాలకు నెలవు విశాఖ

» సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి



కైలాసగిరి కొండపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి, తదితరులు

విశాఖపట్నం, ఆగస్టు 18 : విశాఖ అందాలను అభివర్ణించలేమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి అభిప్రాయపడ్డారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి కైలాసగిరితో పాటు అక్కడ ఉన్న తెలుగు మ్యూజియంను సందర్శించారు. కొండపై ఉన్న అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. సెల్ఫీ పాయింట్ ప్రాంతంలో కలియతిరిగి సెల్ఫీ తీసుకున్న ఆయన కైలాసగిరి కొండపై నుంచి నగర అందాలను తిలకించారు. కుటుంబ సభ్యులతో కలిసి కొండపై ఉన్న అద్దాల టాయ్ ట్రైన్‌లో ప్రయాణించారు. అలాగే రోప్ వేలో నుంచి తీరాన్ని చూస్తూ సందడి చేశారు. తెలుగు మ్యూజియంను సందర్శించి అక్కడి విశిష్టతను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మ్యూజియంలో కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల విశాఖ పర్యటనలో ఎన్నో మధుర స్మృతులను పొందానని గుర్తు చేసుకున్నారు. ప్రకృతి సోయగాలకు, సహజ సిద్ధమైన అందాలకు విశాఖ కేరాఫ్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆయనతో పాటు వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్, విశాఖ రూరల్ తహసీల్దార్ పాల్ కిరణ్, తదితరులు ఉన్నారు.

అప్పన్న సన్నిధిలో హోం మంత్రి అనిత

» మెట్ల మార్గంలో వెళ్లి స్వామివారికి మొక్కులు చెల్లింపు



మెట్లమార్గంలో వెళుతున్న మంత్రి అనిత



కప్ప స్తంభం వద్ద అనిత

సింహాచలం, ఆగస్టు 18 : రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. తొలుత ఆమె కొండదిగువ తొలిపావంచా వద్ద కొబ్బరికాయ కొట్టి, కాలినడకను ప్రారంభించారు. మార్గమధ్యంలో సాక్షి ఆంజనేయస్వామిని దర్శించుకుని, సమీపంలోని వేగవతీధార తీర్థాన్ని స్వీకరించి సింహగిరికి చేరుకున్నారు. ఈఓ శ్రీనివాసమూర్తి ఆమెకు ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండప ప్రదక్షిణ చేసిన మంత్రి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేయగా గోదాదేవి దర్శనం అనంతరం పండితులు చతుర్వేద స్వస్తివచనాలతో ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో దేవాలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు మెట్ల మార్గం అభివృద్ధికి శ్రీకారం చుట్టగా వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంలో మెట్లమార్గం అభివృద్ధి పనులను పునఃప్రారంభించినట్టు చెప్పారు.

ఎలమంచిలిలో వీక్లీ ఎక్స్‌ప్రెస్ హాల్ట్ పట్ల హర్షం



ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో ఆగిన వీక్లీ ఎక్స్‌ప్రెస్ వద్ద ఉన్న ఉద్యోగులు, వ్యాపారులు

ఎలమంచిలి, ఆగస్టు 18: ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇవ్వడంతో ఆదివారం స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రైల్వే స్టేషన్‌లో విశాఖ, ఎస్ఎంవీటీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇవ్వడం పట్ల డైలీ ప్యాసింజర్స్ ప్రతినిధులు, విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వ్యాపారులు స్టేషన్‌కు వచ్చి ఆనందం వ్యక్తం చేశారు. ఎక్స్‌ప్రెస్ రైలు హాల్ట్‌కు కృషి చేసిన రైల్వే అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు జాబ్‌మేళా రేపు

విశాఖపట్నం, ఆగస్టు 18: రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ ఆదేశాలతో కంచరపాలెంలో గల ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 20వ తేదీ మంగళవారం పాలిటెక్నిక్ డిప్లొమా హోల్డర్స్‌కు మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో గ్లోబల్ సంస్థ ఆటోలివ్ డిప్లొమా ట్రైనీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఎలక్ట్రికల్, మెకానికల్, ఆటోమొబైల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ లేదా ఎలక్ట్రానిక్ విభాగాల్లో 2022, 2023, 2024 సంవత్సరాల్లో ఉత్తీర్ణులై ఉండాలి. ఎంపికైన అభ్యర్థుల వార్షిక వేతనం రూ.2.36 లక్షలు చెల్లించనున్నారు. చెన్నైలోని కాంచీపురంలో ఉద్యోగం చేయడానికి సిద్ధపడాలి. గతంలో రిజిస్ట్రేషన్లు చేయని అభ్యర్థులు కూడా మేళాకు హాజరుకావచ్చు. ఆసక్తి అభ్యర్థులు 20వ తేదీ ఉదయం 9 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

విజయవాడ డివిజన్‌లో భద్రతా నిర్మాణ పనులు

» వచ్చే నెలలో మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

విశాఖపట్నం, ఆగస్టు 18: దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపించనున్నట్టు సీనియర్ డీసీఎం కె సందీప్ తెలిపారు. వచ్చే నెల (సెప్టెంబరు) 2, 9, 16, 23న ఎర్నాకులం - పాట్నా ఎక్స్‌ప్రెస్ (22643); వచ్చే నెల 11, 13, 18, 20, 25,27న బెంగళూరు - గువహటి ఎక్స్‌ప్రెస్ (12509); వచ్చే నెల 2, 4, 6, 7, 9, 11, 13, 14, 16, 18, 20, 21, 23, 25, 27, 29న ముంబాయి - భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019) రైళ్లు వయా విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా నడుస్తాయి.

అలాగే, వచ్చే నెల 7, 14, 21, 28న హటియా- ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (18637); వచ్చే నెల 3, 8, 10, 15, 17, 22, 24, 29న హటియా-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12835); వచ్చే నెల 6, 13, 20, 27న టాటానగర్-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12889) రైళ్లు వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడల మీ దుగా నడుస్తాయి.

కాగా, వచ్చే నెల 5, 12, 19, 26న టాటా - యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18111); వచ్చే నెల 2, 11, 18, 25న జసిదిహ్ - తంబరం ఎక్స్‌ప్రెస్ (12376); వచ్చే నెల 2, 9, 16, 23న హటియా - ఎర్నాకులం ఏసీ ఎక్స్‌ప్రెస్ (22837) రైళ్లు వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తాయి. అయితే, ఈ రైళ్లకు మార్గంలోని ఏలూరు స్టేషన్ హాల్ట్‌ను తొలగించారు. అలాగే, వచ్చే నెల 2, 29న ధనబాద్ - అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ (13351) వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తుంది. అయితే ఈ రైలుకు మార్గంలోని తాడేపల్లిగూడెం, ఏలూరు స్టేషన్ల హాల్ట్‌ను తొలగించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

అన్నాచెల్లెళ్ల ప్రేమకు ప్రతిరూపం

నేడు రాఖీ పండగ

రక్షాబంధన్



హాట్‌కేకుల్లా గ్రీటింగులు, రాఖీలు, గిఫ్ట్ ఆర్టికల్స్ అమ్మకాలు

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మం చక్కని మార్గాన్ని చూపిస్తోంది. వేదాలలో వున్న సనాతన ధర్మాలను అవగాహన చేసుకుంటే నేటి సమాజంలో మనిషి మార్గానికి దిశానిర్దేశం అవగతమవుతోంది. ఇంటికొచ్చిన ఆడపడుచును ఆదరించి పంపించాలనే హిందూ ధర్మానికి ప్రతీకగా రాఖీ పండుగను చెప్పుకోవచ్చు. రక్షణ కోరిన మహిళకు రక్షాకవచంగా నిలుస్తానని సోదరుడు అభయమివ్వడమే రాఖీ పండుగ పరమార్థం. ఈ విధంగా రక్షాబంధనం సోదరభావాన్ని పంచుతోంది.



సోదర, సోదరీమణుల మధ్య అంతులేని ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే పండగ రక్షాబంధన్. ఈ పండగను ఏటా శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి రోజున జరుపుకుంటారు. రాఖీ రోజున ప్రతి సోదరి తన సోదరుడికి రాఖీ కడుతుంది. తన సోదరుడు ఆరోగ్యంగా ఉండడంతోపాటు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, తనకు అండగా, రక్షణగా నిలవాలని ఆకాంక్షిస్తారు. కష్టసుఖాల్లో తానున్నానన్న భరోసాను ప్రతి సోదరుడు తన అక్కాచెల్లెళ్లకు ఇస్తాడు.

ఏళ్ల నుంచి నిర్వహణ

రక్షా బంధన్ వేడుకలను ఎన్నో ఏళ్లుగా నిర్వహిస్తూ వస్తున్నారు. రాఖీ ఎప్పటి నుంచి మొదలైందనే దానిపై స్పష్టత లేకపోయినప్పటికీ అనేక కథనాలు మాత్రం ప్రచారంలో ఉన్నాయి. వ్యాస భగవానుడు రచించిన విష్ణు పురాణం ప్రకారం రాఖీ పౌర్ణమిని బలేవా అని కూడా పిలుస్తారు. ఇందుకు ప్రత్యేక కారణం ఉన్నట్టు చెబుతారు. బలిచక్రవర్తి మహావిష్ణువు భక్తుడు. బలిచక్రవర్తి అపారమైన భక్తితో విష్ణుమూర్తిని తన వద్దే ఉంచుకున్నాడు. విష్ణుమూర్తి లేని వైకుంఠం వెలవెలబోతుండడంతో ఆలోచించిన శ్రీమహాలక్ష్మి రాఖీ పౌర్ణమి రోజున బలిచక్రవర్తికి రాఖీ కట్టింది. లక్ష్మీదేవి రాఖీ కట్టగానే బహుమతిగా ఏం కావాలో కోరుకోమని బలి చక్రవర్తి కోరాడు. అప్పుడు లక్ష్మీదేవి.. విష్ణుమూర్తిని తనతో పాటు వైకుంఠానికి పంపాలని కోరగా, ఆయన సమ్మతించాడు. అప్పటి నుంచే రాఖీ కట్టే సంప్రదాయం ఆరంభమైందన్న ప్రచారం ఉంది. మహాభారతంలో ద్రౌపది వస్త్రాపహరణం సమయంలో శ్రీకృష్ణుడిని తలచుకుంటుంది. అప్పుడు కృష్ణుడి సాయంతో ద్రౌపది అవమాన భారం నుంచి తప్పించుకుంటుంది. అన్నాచెల్లెళ్ల బంధానికి గుర్తుగా



ద్రౌపది శ్రీకృష్ణునికి రాఖీ కట్టిందని కూడా చెబుతారు. ఇలా అనేక కథనాలు ప్రచారంలో ఉన్నాయి.

రాఖీ అంటే అర్థం అదే..

రాఖీ అంటే రక్షణ అని అర్థం. తమ సోదరులకు ఎలాంటి ఆపదలు, అవాంతరాలు రాకుండా జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని కాంక్షిస్తూ ప్రతి ఆడపడుచు తన అన్నదమ్ములకు కట్టే రక్షను రాఖీగా చెబుతారు. తమ శ్రేయస్సును, అభ్యున్నతిని కోరుకునే అక్కాచెల్లెళ్లకు రాఖీ పండగ సందర్భంగా కానుకలిచ్చి ఆనందంగా ఉండేలా చేయడం ఆనవాయితీగా వస్తోంది. రాఖీ పౌర్ణమి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. సోమవారం రాఖీ పండగను నిర్దిష్ట సమయంలో జరుపుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఉదయం 9 గంటలు నుంచి 10.30 గంటలలోపు రాఖీ కట్టడానికి ముహూర్తంగా చెబుతున్నారు.

ప్రత్యేక బహుమానాలు

రాఖీ పండగ నేపథ్యంలో నగర పరిధిలో వివిధ రకాల రాఖీల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గడిచిన మూడు రోజుల నుంచి ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి మరీ అమ్మకాలు జరుపుతున్నారు. పది రూపాయల నుంచి రూ.రెండు వేలు, అంతకుమించి (కస్టమైజ్డ్)న ధరల్లో రాఖీలు లభ్యమవుతున్నాయి. రక్షా బంధన్ నేపథ్యంలో స్వీట్స్ డ్రైఫ్రూట్స్ విక్రయాలు కూడా పెరిగాయి. రాఖీలతోపాటు ప్రత్యేకమైన బహుమతులతో కూడిన గిఫ్ట్ ఐటమ్స్ విక్రయాలు ఆశాజనకంగా సాగుతున్నాయి. సోదరీ సోదరులకు ఇచ్చేందుకు అనుగుణంగా స్మార్ట్ వాచ్, పెన్స్, బ్యాగ్స్, చాక్లెట్ బాక్సెస్, డిజైన్డ్ ఫొటో ఫ్రేమ్స్, వ్యాలెట్స్, డిజైన్ కాయిన్స్, నేమ్ బోర్డ్స్, గిఫ్ట్ కాంబో బాక్సెస్, కస్టమైజ్డ్ మగ్స్, డిజైన్డ్ వాటర్ బాటిల్స్, మేకప్ కిట్స్ వంటివి విక్రయిస్తున్నారు.





రాఖీ స్టాళ్ల వద్ద కొనుగోలుదారులు

నేడు సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి లా వర్సిటీ సందర్శన



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ డి సూర్యప్రకాశరావు

సబ్బవరం, ఆగస్టు 18: స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయాన్ని డీఎస్ఎన్ఎల్‌యూ మాజీ చాన్సలర్, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ జితేంద్ర కుమార్ మహేశ్వరి సోమవారం ఉదయం సందర్శించనున్నారని వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి సూర్యప్రకాశరావు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ.. 'నావిగేషన్ లా స్కూల్ అండ్ లీగల్ ప్రొఫెషన్' అనే అంశంపై ప్రసంగిస్తారన్నారు. అనంతరం ఇంటలెక్చువల్ ప్రాపర్టీస్ చైర్,సెంటర్‌ను ఆయన ప్రారంభిస్తారన్నారు. ప్రస్తుతం వర్సిటీలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఏ, ఎల్ఎల్.బి(హానర్స్)తో పాటు ఎల్ఎల్ఎమ్ (ఒక ఏడాది) కోర్సు, పీహెచ్‌డీ, పీహెచ్‌డీ (ఎగ్జిక్యూటివ్), ఎల్ఎల్‌డీ కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ నందిని సీపీ పాల్గొన్నారు.

మాధవపెద్దిని సత్కరించిన మాజీ మంత్రి దాడి



మాధవపెద్ది సురేశ్‌ను సత్కరించిన దాడి వీరభద్రరావు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18: సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేశ్‌ను మాజీమంత్రి దాడి వీరభద్రరావు ఆదివారం సత్కరించారు. జిల్లాలో జరిగే కార్యక్రమానికి హాజరైన మాధవపెద్ది సురేశ్.. మాజీ మంత్రి దాడి వీరభద్రరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాధవపెద్దిని దాడి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సినీ సంగీత విషయాలపై చర్చించుకున్నారు.

'పేట'ను వీడని ట్రాఫిక్ సమస్యలు

» ట్రాఫిక్‌లో ఇరుక్కున్న 108 వాహనం

» రోడ్డుపై వర్షపు నీటితో ఇబ్బంది పడిన ప్రజలు



చిత్రమందిర్ సెంటర్‌లో నిలిచిపోయిన 108 వాహనం

పాయకరావుపేట, ఆగస్టు 18: పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. రోడ్డుపై వాహనాలు, తోపుడు బళ్ళు నిలుపుతుండంతోపాటు పట్టించుకున్నవారులేక ఉదయం, సాయంత్రం సమయంలో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రాత్రి తాండవ వంతెన నుంచి సూర్యమహల్ సెంటర్ వరకు సుమారు గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో 108 వాహనంతోపాటు ప్రజలు రాకపోకలకు అవస్థలు పడ్డారు. స్థానిక తాండవ వంతెన నుంచి వై జంక్షన్ వరకు 1.9 కిలోమీటర్లు పొడవు, సుమారు 100 అడుగుల వెడల్పు ఉన్న మెయిన్‌రోడ్డు ఇప్పటికే ఇరువైపులా ఆక్రమణలతో కుంచించుకుపోయి తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గతేడాది మెయిన్‌రోడ్డును అభివృద్ధి చేసిన అధికారులు ఆక్రమణలను తొలగించకపోవడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కడ గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీనికితోడు ఉదయం, సాయంత్రం హెటిరో కంపెనీ బస్సులు, ఆటోలు మెయిన్‌రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ నిలిపి సర్వీస్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి ప్రజలు నరకాన్ని చవిచూస్తున్నారు. ఆదివారం రాత్రి తాండవ వంతెన నుంచి సూర్యమహల్ సెంటర్ వరకు వాహనాలు నిలిచిపోయి సుమారు గంటపాటు ట్రాఫిక్ సమస్య తలెత్తడంతోపాటు వర్షం పడి రోడ్డుపై నీరు నిలిచిపోవడం ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ట్రాఫిక్ సమస్యతో నిలిచిపోయిన వాహనాలు


బాబోయ్.. వానరాలు

భయభ్రాంతులకు గురిచేస్తున్న కోతులు

» మిలట్రీ కాలనీ, కొత్తపేట, ఏఎస్ఆర్ కాలనీల్లో సంచారం

» కౌన్సిల్ తీర్మానం చేసినా స్పందించని అధికారులు

» పదేళ్ల తర్వాత పట్టణవాసులకు పాట్లు



ఎలమంచిలి పట్టణం కొత్తపేట ప్రధాన రోడ్డుపై విచ్చలవిడిగా సంచరిస్తున్న వానర మూక



ఎలమంచిలి మిలట్రీ కాలనీలో కారుపై కోతులు

ఎలమంచిలి, ఆగస్టు 18 : పట్టణ ప్రజలను వానర మూకలు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కోతుల మూక సంచారంతో గృహిణులు, వ్యాపారులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పదేళ్ల క్రితం వానర మూక దాడులతో అల్లాడిన పట్టణ జనానికి ఇప్పుడా సమస్య మళ్లీ ఎదురవడంతో అలజడికి గురవుతున్నారు. దారిన పోయే వారిపై కూడా కోతులు దాడి చేసి గాయపరుస్తున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. పదేళ్ల క్రితం పట్టణంలో వానర మూక విపరీతంగా పెరిగిపోవడంతో అప్పటి పాలకవర్గం, అధికారులు కోతులను పట్టించి అటవీప్రాంతాలకు తరలించారు. ఏడాది నుంచి కోతుల సమస్య మరలా తెర మీదకు వచ్చింది. రెండు నెలల క్రితం జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో కోతులను పట్టించేందుకు తీర్మానం చేసినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా వానరాల దాడులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలోకి ప్రవేశించి వస్తు సామగ్రిని, తినుబండారాలను నాశనం చేస్తున్నాయి. ప్రతిఘటించిన గృహిణులను గాయపరుస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లోని చిరు వ్యాపారుల సముదాయంలోకి ప్రవేశించి వ్యాపార సామగ్రిని నష్టపరుస్తున్నాయి. దీంతో కోతుల నుంచి రక్షించుకునేందుకు చేతిలో కర్ర పట్టుకుని దుకాణం ముందు ఒకరు ఉండాల్సి వస్తుందని కొందరు వ్యాపారులు వాపోతున్నారు. మునిసిపాలిటీలో ప్రధానంగా మిలట్రీ కాలనీ, కొత్త పేట, నాగేంద్రకాలనీ, అల్లూరి సీతారామరాజు కాలనీ వంటి ప్రాంతాల్లో కోతుల మూక తిష్ట వేసి ఉంటున్నాయి. ఇళ్ల ప్రాంగణంలోని పండ్ల చెట్లను, పువ్వుల మొక్కలను పాడు చేస్తున్నాయి. వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తూ పాఠశాలలకు వెళ్లే చిన్నారులపైన వీటి ప్రతాపం చూపుతున్నాయి. కోతుల మూక దాడుల నుంచి రక్షించాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.



వానర మూక దాడి నుంచి రక్షించుకునేందుకు చేతిలో కర్ర పట్టుకుని ఉన్న చిరు వ్యాపారి

సందడిగా మరిడిమాంబ ఘటాల ఊరేగింపు



ఘటాలతో ఊరేగుతున్న ఎమ్మెల్యే, కమిటీ ప్రతినిధులు, భక్తులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18: స్థానిక కోట్నీవీధి మరిడిమాంబ అమ్మవారి ఘటాల ఊరేగింపు ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఉత్సవమూర్తిని తలపై పెట్టుకుని ఊరేగారు. ఈనెల 22వ తేదీన అమ్మవారి ఉత్సవం జరగనున్న నేపథ్యంలో ఘటాల ఊరేగింపు నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు పురవీధుల గుండా సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోట్నీ పూర్ణ చంద్రరావు, తలారి లక్ష్మీప్రసాద్, పీలా నాగశ్రీను, కోట్నీ కొండలరావు, ఇలాపు శ్రీనివాసరావు, నగిరెడ్డి మధు, కోట్నీ రాంబాబు, కోట్నీ అయ్యన్నదొర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లాలం భాస్కరరావు విగ్రహావిష్కరణ



లాలం భాస్కరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, తదితరులు

రాంబిల్లి, ఆగస్టు 18: తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత స్వర్గీయ లాలం భాస్కరరావు విగ్రహావిష్కరణ ఆదివారం పార్టీ శ్రేణులు, లాలం కుటుంబ సభ్యులు, అభిమానుల నడుమ ఘనంగా జరిగింది. మండలంలోని లాలంకోడూరులో లాలం భాస్కరరావు విగ్రహాన్ని ఎంపీ సీఎం రమేశ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ, కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, ఎలమంచిలి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ లాలం భాస్కరరావు కార్యక్రమం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తెలియజేయడంతో ఆయన కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారన్నారు. భాస్కరరావు రాజకీయ నేతగానే కాకుండా సేవా దృక్పధం కలిగిన మహోన్నత నేత కొని యాడారు. అనంతరం ఎమ్మెల్యేలు లాలం సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా పాఠశాలలకు కంప్యూటర్లు, యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తాతయ్యబాబు, దూళి రంగనాయకులు, ముత్యాలపాప, పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలుపాల్గొన్నారు.

పిల్లర్లకే పరిమితం..!


ప్రస్తుత మండల రెవెన్యూ కార్యాలయం నిర్వహిస్తున్న ఈ భవనంలోనే...

- అసంపూర్తిగా తహసీల్దార్ కార్యాలయ భవనం
- 2018లో రూ.90 లక్షలతో నిర్మాణానికి శంకుస్థాపన
- అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు
- గత ఐదేళ్లూ కనీసం పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంలోనైనా మోక్షం కలిగేనా..?


2018లో తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన దివంగత ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, తదితరులు (ఫైల్ ఫొటో)


పిల్లర్లతో నిలిచిపోయి తుప్పల్లో దర్శనమిస్తున్న భవన నిర్మాణం

అనంతగిరి, ఆగస్టు 18: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం పిల్లర్లకే పరిమితమైంది. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ కార్యాలయ భవన నిర్మాణానికి పూనుకుంది. దివంగత అరకు మాజీ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు చొరవతో రూ.90 లక్షలు మంజూరయ్యాయి. నిర్మాణ పనులకు 2018లోని శంకుస్థాపన చేశారు. ప్రారంభంలో పనులు ఊపందుకున్నాయి. పునాది, పిల్లర్ల పనులు పూర్తయ్యాక 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఫలితంగా అక్కడితోనే భవన నిర్మాణం నిలిచిపోయింది. గత ఐదేళ్లలో భవన నిర్మాణ విషయమై కనీసం ఊసెత్తలేదు. దీంతో మండల రెవెన్యూ కార్యాలయం అధికారులు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు.

మండలంలో 24 పంచాయతీల నుంచి వీఆర్వోలు, వీఆర్ఏలు రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. మండలానికి సంబంధించిన భూ రికార్డులు భద్రపరిచేందుకు గదులు లేకపోవడంతో ఉన్న గదుల్లోనే ఉంచాల్సిన దుస్థితి ఏర్పడింది. అలాగే సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, సర్వేయర్, ప్రస్తుతం ఉన్న భవనంలోని విధులు నిర్వహిస్తున్నారు. చిన్న గదులు కావడంతో భూ సమస్యలపై గిరిజనులు విన్నవించేందుకు వచ్చినప్పుడు బయట నిలవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కాగా, టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేవారు. దీంతో అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరిగేవి. ఎప్పుడైతే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో భవన నిర్మాణ, అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కాంట్రాక్టర్లపై ఒత్తిడి పెరగడంతో మధ్యలోనే పనులు నిలిపివేసి ఉంటారని గతంలో విమర్శలు వినిపించాయి. ఇటీవలే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో అభివృద్ధి పుంజుకునేందుకు అస్కారం ఉందని, మండల రెవెన్యూ కార్యాలయ భవనానికి మోక్షం కలుగుందని గిరిజనులు, అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

హోం మంత్రి అనితను కలిసిన గిడ్డి ఈశ్వరి


హోంమంత్రి అనితను ఆమె నివాస గృహం కలిసిన గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, ఆగస్టు 18: రాష్ట్ర హోం శాఖ మంత్రి వి.అనితను టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆదివారం విశాఖపట్నంలోని ఆమె నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న వివిధ సమస్యలను మంత్రి అనితకు వివరించానని ఈశ్వరి తెలిపారు. గంజాయి నిర్మూలనకు పోలీసు శాఖ చేస్తున్న ప్రచారం, దాడులను గురించి వివరించామని చెప్పారు. గంజాయి సాగు చేసే గ్రామాల్లో పోలీసులతో పాటు తాము కూడా విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించి గిరిజన ప్రాంత రైతులను గంజాయి సాగుకు దూరం చేసేందుకు పార్టీ శ్రేణులతో కలిసి కృషి చేస్తామని తెలిపామన్నారు. జిల్లాలో వివిధ సమస్యలను వివరించానని, మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు.

గంజాయి సాగు, రవాణాతో అనర్థాలు

కొయ్యూరు, ఆగస్టు 18: గంజాయి సాగు, రవాణాతో అనేక అనర్థాలు పొంచి ఉన్నాయని సీఐ పీవీ రమణ చెప్పారు. కొయూరు వారపు సంతకు వచ్చిన గిరిజనులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. కొయ్యూరు వారపు సంత, బూదరాళ్ల పరిసర గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో సీఐ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణ వంటి చర్యలు చట్టరీత్యా నేరమని అవగాహన కల్పించారు. మూరుమూల గ్రామాల్లో గంజాయి సాగు వల్ల మైదాన ప్రాంతాలకు చేరి అనేక మంది యువకులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. గిరిజనులు చట్టవ్యతిరేకమైన గంజాయి సాగు జోలికి వెళ్లవద్దన్నారు. సంప్రదాయబద్ధమైన పంటలను పండించాలని సూచించారు. సంప్రదాయ బట్టలకు ప్రభుత్వం తరుపన విత్తనాలు పంపిణీ, ఎరువులు సరఫరా వంటివి రైతులకు అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఏడి పింఛన్..!

- రెండేళ్లుగా వృద్ధులకు అందని పింఛన్ సొమ్ము
- పునరుద్ధరించాలని ఆదివాసీ మహిళల వేడుకోలు


ఫించన్ కోసం ఎదురు చూస్తున్న చప్పిపుట్టు గ్రామానికి చెందిన వృద్ధులు

పాడేరు రూరల్, ఆగస్టు 18: వైసీపీ ప్రభుత్వంలో గ్రామ వలంటీర్ల నిర్లక్ష్యం కారణంగా ఆరుగురు పీవీటీజీ వృద్ధ మహిళలు పింఛన్ అందడం లేదు. రెండేళ్ల క్రితం పింఛన్‌కు దూరమై బతుకు భారమై దయనీయంగా వారు జీవనం సాగిస్తున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా పింఛన్ వస్తుందని ఆశతో ఎదురు చూస్తున్నారు.

ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ మాట్లాడుతూ అల్లూరి జిల్లా పాడేరు మండలం వంతాడపల్లి పంచాయతీ చప్పిపుట్టు గ్రామానికి చెందిన పీవీటీజీ వృద్ధ మహిళల మర్రి బుటిలి (73) కళ్లు కనిపించవు. మర్రి చిత్రో (74), మర్రి పులిమే (69), మర్రి నిసో (69), కొర్ర జింబ్లో (58), పాంగి కృష్ణ (68) అనే ఆరుగురు వృద్ధులకు సంబంధించి గ్రామ వలంటీర్ల తప్పుడు సర్వే కారణంగా 2021వ సంవత్సరం అక్టోబరు నెల నుంచి పింఛన్‌ను నిలిపివేశారని బాధితులు వాపోతురన్నారు.

అప్పటి నుంచి పింఛన్ మంజూరు చేయాలని కార్యాలయాల చుట్టూ తిరిగినప్పటికీ ఫలితం లేకపోవడంతో బతుకు భారమైన జీవనం సాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచారణ చేసి బాధితులను పింఛన్ పునరుద్ధరించాలని కోరారు.

ఈ విషయమై ఎంపీడీవో కె.సాయినవీన్‌ను వివరణ కోరగా సప్పిపుట్టు గ్రామంలో నిలిపిన ఆరుగురు పింఛన్‌దారులకు పది ఎకరాలకు మించి భూములు ఉన్నందున నిలుపు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే మర్రి బుటిలి, మర్రి చిత్రో, మర్రి పులిమే, కొర్రా జింబ్లో, పాంగి కృష్ణలకు పది ఎకరాలకు పైబడి భూమి ఉందన్నారు. అలాగే మర్రి నిసో ఇంటిలో ఉన్న ఒక రేషన్ కార్డులో రెండు పింఛన్‌లు ఉన్నందున నిలుపు చేసినట్టు ఆయన తెలిపారు.

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం

పాడేరు రూరల్, ఆగస్టు 18: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. మన్యంలోని వివిధ గ్రామాల భక్తులతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి, మొక్కులు తీర్చుకొనేందుకు రావడంతో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఆలయం కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులు క్యూకట్టారు. మైదాన ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని ప్రత్యేకంగా పూజలు చేశారు. అలాగే పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్‌లోని అమ్మవారి పాదాల వద్దకు మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


మోదకొండమ్మను దర్శించుకోవడానికి క్యూ కట్టిన భక్తులు

ఆదివాసీ రైతులకు బ్యాటరీ స్ప్రేయర్ల పంపిణీ

- టాటా ట్రస్టు శాస్త్రవేత్త డాక్టర్ అప్పలరాజు


రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న టాటా ట్రస్టు శాస్త్రవేత్త

చింతపల్లి, ఆగస్టు 18: ఆదివాసీ రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు పంపిణీ చేసినట్టు టాటా ట్రస్టు శాస్త్రవేత్త డాక్టర్ అప్పలరాజు తెలిపారు. ఆదివారం స్థానిక ఉద్యాన పరిశోధన స్థానంలో పసుపు, మిరియాలు పంటల్లో మేలైన సాగు పద్ధతులు అంశంపై గిరిజన రైతులకు శాస్త్రవేత్తలు శిక్షణ ఇచ్చారు. ఈమేరకు సేంద్రీయ పద్ధతుల్లో పసుపు, మిరియాలు సాగు చేసుకునే నూతన పద్ధతులను టాటా ట్రస్టు శాస్త్రవేత్తతోపాటూ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ శివ కుమార్ రైతులకు వివరించారు. ప్రధానంగా దుంపకుళ్లు, కాండం కుళ్లు తెగుళ్ల నివారణ పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం రైతులకు పంటలకు కషాయాలు పిచికారి చేసే బ్యాటరీ స్ప్రెయర్లు, ట్రైకోరెర్మా,సుడోమోనస్ క్రిమిసంహారకక మందులను రైతులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త శెట్టి బిందు తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనలో నిందితులను శిక్షించాలి

- వేర్వేరు చోట్ల నిరసనల్లో సీపీఐ, ఐద్వా ప్రతినిధుల డిమాండ్



నెహ్రూచౌక్ జంక్షన్‌లో సీపీఐ నాయకులు ఆందోళన


గొర్లివానిపాలెం పంచాయతీలో మాట్లాడుతున్న ఐద్వా ప్రతినిధి మాణిక్యం

అనకాపల్లి, ఆగస్టు 18 : కోల్‌కతాలో వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ర్యాలీ నిర్వహించి, నెహ్రూచౌక్ జంక్షన్‌లోని బుద్ధుని విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. దేశంలో రోజు రోజుకు విపరీతంగా మహిళల పై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టకపోవడం ప్రభుత్వాల వైఫల్యంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరాచారి, సత్యనారాయణ, పోతురాజు, రామారావు, బాబ్జి, హరీష్, రమణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఆదివారం గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహిళలపై రోజురోజుకి అఘాత్యాలు పెచ్చుమీరిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు శిక్షలను మరింత కఠినతరం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పరవాడ ఏరియా కమిటీ ప్రతినిధులు జి. లక్ష్మి, కె.రమణమ్మ, జి.మణి, వరలక్ష్మి, సన్యాసమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి వ్యతిరేకంగా 'జైభారత్' పోరాటం

కోటవురట్ల, ఆగస్టు 18 : జైభారత్ అనకాపల్లి జిల్లా సమావేశాన్ని ఆదివారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా సదరు సంస్థ జాతీయ కార్యదర్శి లోక్‌నాథ్ మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా జైభారత్ పనిచేస్తున్నట్టు చెప్పారు. సమాజంలో అసమానతలకు వ్యతిరేకంగా, మహిళల హక్కుల సాధనకు పోరాటం చేస్తున్నట్టు వివరించారు. అనంతరం అనకాపల్లి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాసరపు అర్జున్‌రావు, ఉపాధ్యక్షుడిగా డి. సత్తిబాబు, ప్రధాన కార్యదర్శిగా బత్తుల సత్యనారాయణ, కార్యదర్శులుగా ఎస్‌కే జిలానీ, జి.లోవరాజు ఎన్నికయ్యారు.

'వైద్యాలయంలో అవినీతిపై చర్యలు చేపట్టాలి'

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18 : ఎన్టీఆర్ వైద్యాలయంలోని ప్రసూతి విభాగంలో అవినీతి అక్రమాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌కు శనివారం పలువురు వినతి పత్రం అందజేశారు. ప్రసూతి విభాగంలో గర్భిణులకు ప్రసవం జరిగిన తర్వాత వారి నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ప్రజా రాజకీయ వేదిక ప్రతినిధి కనిశెట్టి సురేష్‌బాబు, సీపీఐ ప్రతినిధులు రాజాన దొరబాబు, వైఎన్ భద్రం ఆరోపించారు. పలు సందర్భాల్లో మెడిసిన్ కూడా బయట నుంచి కొను క్కొని తీసుకురావాలని చెబుతున్నారని పేర్కొన్నారు.

హస్త కళాకారులకు ఉచిత విద్యుత్ కల్పించాలి

ఎలమంచిలి, ఆగస్టు 18 : హస్తకళా నైపుణ్యం ద్వారా జాతీయ స్థాయిలో ఉమ్మడి విశాఖ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఎలమంచిలి మండలం ఏటికొప్పాకలోని హస్త కళాకారులు ప్రభుత్వం తమకు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేయాల్సిందిగా కోరుతున్నారు. ఈ గ్రామంలో సుమారు 150 కుటుంబాలు హస్తకళా రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నారు.

బదిలీల జాతర

... 3వ పేజీ తరువాయి

ఉద్యోగులు/అధికారులు బదిలీ కోరుకుంటే... కనీసం రెండేళ్లు అంతకంటే ఎక్కువగా పాడేరు ఐటీడీఏ పరిధిలో సర్వీసు పూర్తిచేసుకున్నవారు, 50 ఏళ్ల వయసు పైబడిన వారు అర్హులు. ఏజెన్సీ నుంచి మైదానానికి వచ్చే ఉద్యోగి/ అధికారి విధిగా అతని స్థానంలో పోస్టింగ్ పొందిన ఉద్యోగి/అధికారికి బాధ్యతలు అప్పగించాలి. అంటే రిలీవర్ వస్తేనే మార్పునకు అవకాశం ఉంటుంది. కాగా ఉద్యోగ సంఘాల్లో బాధ్యులుగా పనిచేసే (అధ్యక్ష, కార్యదర్శి, ఇతర సభ్యులు) ఉద్యోగుల విషయంలో కనీసం తొమ్మిదేళ్ల వరకు ఒకేచోట పనిచేసుకునే అవకాశం కల్పించారు. కానీ విశాఖలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగ సంఘాల ఎన్నికలు ఫార్స్‌గా మారాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మినహాయింపులపై అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

సంప్రదాయ వరి విత్తనాలకు పునరుజ్జీవం

... 3వ పేజీ తరువాయి

వంగడాలను సేకరించారు. సుమారు 150 మంది రైతుల నుంచి 21 రకాల వంగడాలను సేకరించారు. శాస్త్రవేత్తలకు వంగడాలు అందజేసిన రైతుల వ్యక్తిగత సమాచారం తీసుకున్నారు. ఈ వంగడాలకు ఒక్కొక్క ప్రాంత ఆదివాసీలు ఒక్కొక్క పేరుతో పిలుస్తున్నారు. దీంతో శాస్త్రవేత్తలు వంగడాలకు నంబర్లు కేటాయించి పరిశోధనలు ప్రారంభించారు. 21 వరి వంగడాల్లో కాలభట్‌లో అత్యధిక పోషక విలువలతో పాటు సువాసనల లక్షణం కలిగి వుంటుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. అలాగే కళ్లజీర, టెటెమ్ ధాన్యం, ఇసుక రవ్వలు-1, 2, సన్నధాన్యం, సొపురు ధాన్యం రకాల్లోను మంచి పోషక విలువలతోపాటు ఔషధ గుణాలు ఉన్నట్టు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఐదేళ్లు పరిశోధనలు..

సంప్రదాయ వరి రకాల విత్తనాలపై ఐదేళ్లపాటు పరిశోధనలు నిర్వహించేందుకు శాస్త్రవేత్తలు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రతి ఏడాది ప్రయోగాత్మక సాగు దిగుబడుల్లో వరి రకాలను ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించి పోషక విలువలు, ఔషధగుణాలు ఏ స్థాయిలో ఉన్నాయో నివేదిక సిద్ధం చేస్తారు. అలాగే నాణ్యత, దిగుబడులపై కూడా అధ్యయనం చేస్తారు. మంచి ఫలితాలు ఇచ్చిన మేలిజాతి వంగడాలను ఎంపిక చేసి పరిశోధనలు కొనసాగిస్తారు. 21 రకాలలో కనీసం తుది దశకు 5, 6 మేలిజాతి వంగడాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

విత్తనోత్పత్తికి ప్రాధాన్యం..

ఐదేళ్లలో ప్రతి ఏడాది మంచి ఫలితాలు ఇచ్చే వంగడాలను గుర్తిస్తూ విత్తనోత్పత్తికి శాస్త్రవేత్తలు ప్రాధాన్యం ఇస్తారు. ఐదేళ్ల తర్వాత మేలిజాతి విత్తనాలను రైతులకు అందజేసి పంట పొలాల్లో సాగు చేయిస్తారు. మరో మూడేళ్లు పరిశోధన స్థానం, రైతుల పొలాల్లో సాగు చేసి వరి దిగుబడుల ఫలితాలు అధ్యయనం చేసి తుది దశ మేలిజాతి వంగడాలను ఎంపిక చేసి విత్తనోత్పత్తికి అధిక విస్తీర్ణంలో సాగు చేపట్టనున్నారు.

ఎనిమిదేళ్లలో మార్కెట్‌లోకి సంప్రదాయ రకాలు

-డాక్టర్ అప్పలస్వామి, ఏడీఆర్, చింతపల్లి



ఎనిమిదేళ్లలో దేశీయ మార్కెట్‌లోకి ఆదివాసీ రైతుల సంప్రదాయ వరి రకాల వంగడాలు అందుబాటు లోకి రానున్నాయి. ఒక రకం విత్తనం విడుదల చేసేందుకు ఎనిమిదేళ్లు వివిధ దశల్లో పరిశోధనలు చేపట్టాలి. తుది దశలో ఎంపిక చేసిన వరి రకాలకు నామకరణం చేసి విడుదల చేస్తాం. వరి రకాలు అందజేసిన రైతు పేరిట పేటెంట్ రిజిస్ట్రేషన్ చేయిస్తాం. దీంతో నూతన వంగడాల వల్ల రైతు కుటుంబానికి మేలు జరుగుతుంది. విశ్వవిద్యాలయం అధికారులు, ప్రభుత్వం పూర్తి సహకారం అందించడం వల్ల సంప్రదాయ రకాలపై పరిశోధనలు చేపడుతున్నాం.

☛ సంక్షిప్తంగా..

200 మందికి నేత్ర పరీక్షలు

అరకులోయ, ఆగస్టు 18: సీబీఎం చర్చి ఆవరణలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 200 మందికి నేత్ర తనిఖీలు చేసినట్టు ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు ఓలేసి బాబూరావు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యశాలకు చెందిన వైద్యులు, సిబ్బంది పాల్గొని పరీక్షలు జరిపారన్నారు. శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యశాలకు చెందిన మేనేజర్ ఎం.చంద్రశేఖర్ పర్యవేక్షణలో శిబిరం ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. వైద్యుల సూచన మేరకు కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని నేత్ర వైద్యశాలకు తరలించి శస్త్ర చిరిత్సలు చేపడతారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఓలేసి బాబురావు, కోశాధికారి సక్సేనా, సభ్యులు సంజీవ్‌ప్రసాద్, బురిడి ఆనందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి వ్యాక్సినేషన్

డుంబ్రిగుడ, ఆగస్టు 18: మండల వ్యాప్తంగా 18 పంచాయతీల్లో పశుసంవర్థక శాఖ అధ్వర్యంలో మూగ జీవులకు వ్యాక్సినేషణ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఈ నెల 20వ తేదీ నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి మూగజీవులకు వ్యాక్సిన్ చేయాలని ఆదేశించారు. గిరిజన గ్రామాల్లో ఎటువంటి వైద్యం కావాలన్నా పశు సిబ్బందిని, సంప్రదించాలని ఆమె కోరారు.

ఉరుములో విద్యుత్ పునరుద్ధరణ

జి.మాడుగుల, ఆగస్టు 18: మండల కేంద్రంలోని చిన్నఉరుములో విద్యుత్ సదుపాయం కల్పించినట్టు పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అధికారి ఏవీఎస్ అప్పారావు చెప్పారు. గత కొద్ది రోజులుగా విద్యుత్ సమస్యపై వివిధ పత్రికల్లో వచ్చిన కథనాల మేరకు జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే విద్యుత్ పునరుద్ధరణకు ఆదేశించడంతో ఆదివారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి విద్యుత్ సౌకర్యం కల్పించినట్టు ఆయన తెలిపారు.

ఎమ్మెల్సీగా బొత్స విజయంపై హర్షం

చింతపల్లి, ఆగస్టు 18: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్టు స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. ఆదివారం విశాఖపట్నంలో పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో కలిసి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాజకీయ అనుభవం కలిగిన సత్యనారాయణ ఎమ్మెల్యేగా ఎన్నుకోబడడం వల్ల చట్ట సభల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సమస్యలు ప్రస్తావించే అవకాశం ఉంటుందన్నారు.

కొనసాగిన వైద్యుల ఆందోళన

ముంచంగిపుట్టు, ఆగస్టు 18: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది చేపట్టిన ఆందోళన కార్యక్రమం రెండో రోజు ఆదివారం కొనసాగింది.. అత్యవసర వైద్య సేవలు మినహా ఇతర వైద్య సేవలను పూర్తి స్థాయిలో నిలిపివేశారు. నల్ల బ్యాడ్జీలను పెట్టుకొని నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తేడవంతో పాటు ఉన్న చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గీతాంజలి, సంతోష్, ధరణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో భారీ వర్షం

ముంచంగిపుట్టు, ఆగస్టు 18: మండల పరిధిలో ఆదివారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. రహదారులు చిత్తడైపోయాయి. వాగులు వంకలు, మత్స్యగెడ్డ పాయలు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అలాగే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ దారెత్తించింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది.

మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు మృతి


వెంకటేశ్వర్లు (ఫైల్)

జి.మాడుగుల, ఆగస్టు 18: మండల కేంద్రానికి చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ కూడ వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందారు. వెంకటేశ్వర్లు టీడీపీ అవిర్భావం నుంచి క్రియాశీలకంగా ఉంటూ సర్పంచ్‌గా, ఒక పర్యాయం ఎంపీపీగా పనిచేశారు. అయితే కొంతకాలంగా అనారోగ్యంతో పోరాడుతూ ఆదివారం మృతి చెందారు. అతని మృతి పట్ల పలువురు నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సుదీర్ఘంగా పార్టీలో అనేక సేవలు అందించి, మండల అభివృద్ధికి కృషి చేశారని మాజీ మంత్రి మణికుమారి గుర్తు చేశారు. టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, మత్స్యరాస మత్స్యరాజు, నాగబ్బాయి, గంతందొర, బాలయ్యదొర,పిన్నయ్యదొర, భీంబాబు భారీ ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొని సంతాపం తెలిపారు.

శరభన్నపాలెం ఉపాధ్యాయుడు మృతి


సత్యనారాయణ (ఫైల్)

కొయ్యూరు, ఆగస్టు 18: మండలంలోని శరభన్నపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్న కంకిపాటి సత్యనారాయణ (56) ఆదివారం మధ్యాహ్నం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సత్యనారాయణ మృతిపై ఎంఈవో రాంబాబు, ఏటీడబ్ల్యూవో క్రాంతి, పలు పాఠశాలల ఉపాధ్యాయులు నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

సెల్ టవర్ గొయ్యిలో పడి ఆవు మృత్యువాత

గూడెంకొత్తవీధి, ఆగస్టు 18: మండలంలోని రింతాడ పంచాయతీ ఊబపాలెం గ్రామంలో సెల్ టవర్ కేబుల్ నిర్మాణం కోసం తీసిన గొయ్యిలో పడిపోయిన ఆవు మృతి చెందింది. శనివారం ఉదయం యథావిధిగా కాపరి పశువులను మేతకు తీసుకువెళ్లాడు. ఊబపాలెం గ్రామానికి చెందిన కొర్ర బొజ్జన్నకు చెందిన ఆవు సాయంత్రం గృహానికి రాలేదు. ఆదివారం ఉదయం పశువు కోసం గాలించగా గ్రామ శివారులో సెల్ టవర్ కేబుల్ నిర్మాణం కోసం తీసిన గొయ్యిలో పడిపోయి మృతి చెంది కనిపించింది. రోజులు తరబడి పూడ్చకపోవడంతో ఆవు మృతి చెందిందని బాధితుడు వాపోయాడు.